# మిస్టేక్

"డర్టీ న్యూసెన్స్!" అని పైకే విసుక్కుంది శ్యామల. అప్పటికింకా శేఖరం గుమ్మందాటి వుండడు.

మూడు రోజుల్నుంచీ శేఖరాన్నెలా గయినా హర్ట్ చెయ్యాలనుంది.

అతను తల్చుకొంటే తన కొచ్చే అప్రతిష్టనీ ఒచ్చేసిన ఆపదనీ "ఏమీ లేదు పొ"మ్మని తీసి అవతల పారెయ్యగలడు. అలా అతను చెయ్యడని ఖచ్చితంగా తెలిసేవరకు అతని అవసరం చాలా ఉంది తనకి.

అయినా సరే తను బాధపడ్డానికతనే కారణం అన్న సంగతి పదే పదే మనసులో మెదుల్తోంది. మనసంతా అదే ఆలోచన.

ఒక్క తెలివి తక్కువ పని; శాశ్వతమైన ముద్ర.

అతనికి శిక్ష లేదు; సరికదా. కొంచెం బాధకూడా లేదు. తనని ఆపదలో ముంచేడు. అవమానం చేసేడు. ఫూల్ చేసేడు. . . హర్ట్ చేస్తున్నాడు. ఇది చాలా అన్యాయం. తననింత చిక్కులో పెట్టినందుకు అతన్ని గట్టిగా ఒకదెబ్బ కొట్టడానికీ, ఘాటుగా కోప్పడడానికీ కూడా వీల్లేక పోవడం దారుణం . . . ఓపికుంటే ఓ ఏడుపు ఏడ్చి వూరుకోవచ్చు. . .

"అలా మూడీగా అయిపోకు శ్యామూ. మనం దేనికేదో సొల్యూషను ఆలోచిద్దాం" అంటాడు. ఆ అనేదేదో కమాండింగ్‌గా, డిమాండింగ్‌గా మొగవాళ్ళా అనడేం? తనక్కూడా ఏదో ప్రమాదం జరిగిపోయినట్టుగా మొహం దీనంగా పెడతాడేం?

"మనం తప్పకుండా పెళ్ళిచేసుకోగలం" ఎప్పట్నుంచో అంటున్నాడు. మరి అలా గిల్టీగా పెడతాడేం, మొహమూ గొంతుకా . . . నిన్ననొకసారి అనిపించింది; ఈ అవసరంవల్ల ఈ పిరికి వాణ్ణి కొసాకీ మెడకి తగిలించుకోడం కంటే ఈ తెలివితక్కువ వ్యవహారం మరచిపోయి.. కొత్తబతుకు వెతుక్కుంటే మంచిదేమోనని.

సొల్యూషను ఆలోచిస్తానంటాడు. తన మనస్సులో ఆలోచనని పసిగట్టినట్టు. "ఇదేదో ముదరకుండా చూసుకుందాం" అనేగా. అతనుద్దేశం! ... ఎంత దారుణం, ఎంత రాక్షసం!

అవును నిజమే. ఆ ఆలోచన ఇద్దరిలో మొదట తనకే వచ్చింది. . . అయినా, ఎందుకో అతనిదే అన్యాయంలా వుంది. ఇందులోకూడా ఏదో మిష్టేక్ వుంది. తనకి అదే ఆలోచన కలిగినప్పుడు అది తనకి అవసరంలా తోచింది. అదే అతనికి స్ఫురించగానే అందులో అతనిస్వార్థం, ప్రయోజనం ఏదో ఇమిడివున్నట్టు అనుమానం పీడిస్తోంది.

బాగా చదువుకొన్నాననీ, సుళువుగా ఎవరిటోపీలోనూ పడనని తనకి గర్వం. ఆ గర్వమే తన అహం. ఎత్తినతల ఎత్తినట్టే వుంది. అహం దెబ్బతింది. అహర్నిశలూ భయపెట్టే సమస్య ఒచ్చిపడింది.

........భయం........

భయపడవలసిందేమీ లేదు.దీని చుట్టూరా వున్న చీదరతప్ప.

ఆడదీ మగవాడూ ప్రేమించుకోడం సహజం; కలిసి తిరగడం సహజం. ఇంటిమసీ కూడా సహజమే ... సుఖం వెనుక కష్టం వుం టుందంటారు. కష్టానికి తను ఎప్పుడూ భయపడలేదు. రకరకాల ఆపదల్లోంచి దర్జాగా అందర్నీ ఎదిరించి తప్పుకున్నది తను.

ఇది న్యూసెన్సు. చీదర. ఈ క్షుద్రాన్ని ఎదిరించి తప్పు కోడం కష్టంగా వుంది.

## 2

"శేఖరం!"

రోడ్డవతల పదమూడో నెంబరు బస్సు కోసం పరుగెత్తు తున్నాడు శేఖరం. ఇవతల్నుంచి శ్యామల కేక.

బస్సు తప్పిపోయినవాడి మొహంపెట్టి యిటు తిరిగాడు శేఖరం.

అక్కడతను.

ఇక్కడ తను

శ్యామల అటువెళ్ళాలని ముందుకు వంగింది. కఠోరంగా హారన్ మ్రోగించుకొంటూ అసహ్యంగా అడ్డంవచ్చింది జీపు. పడిపో బోయి నిలదొక్కుకుంది. ఆ అరవై అడుగుల రోడ్డుకు అటూ ఇటూ అరవై సెకండ్లు ఎడబాసి ఉండడం ... చిరాగ్గావుంది. అతనెందుకు తనవేపు రాకూడదు; నిన్నటిదాకా అలా వచ్చినవాడేగా ఇప్పటి కిప్పుడు ఈ నిరుత్సాహం, ఈ పిరికితనం, పలాయన సూత్ర పఠనం ఎందుకు!?

కాదేమో?

ఔనేమో,

డర్టీ న్యూసెన్సు!...ఒస్తే రానీ, పోతే పోనీ- అటుచూడకు: పిలవడం అయిందిగా.

ఒచ్చేడు.

రెండు చేతులూ పట్టుకున్నాడు "నువ్విలాంటిపని ఎప్పుడూ చేయనని నాకు మాటివ్వాలి."...చప్పున విదిలించింది, చేతుల్ని. ఆహా! ఏం ఐడియా!...టిమిడ్ క్రీచర్! నేనాత్మహత్య కోసం ప్రయత్నించనని మాటివ్వాలి ... అంత బుద్ధిహీనురాల్నని అనుకుంటున్నాడా? - అనుకోవడ మేమిటి, అంటున్నాడు... అమాత్రం అర్థం చేసుకోలేకపోయిన దానికి ఇన్నాళ్ళూ కలిసి తిరగడాలూ, ఈ స్నేహం, ఈ ఇంటిమసీ ఎందుకు?

ఆపదలు మనుషుల్లో మంచిని, ఔదార్యాన్ని, హృదయ వైశాల్యాన్ని, అవతలి మనిషిని అర్థంచేసుకోనే సహృదయతనీ పెంచుతాయంటారు. నిజమేనా? వొకర్ని గూర్చిమరొకరు నీచంగా, హీనంగా నిందాత్మకంగా వూహించుకోడం నేర్పుతాయేమో!

నడక

నిశ్శబ్దం

"నేనంత పిరికిదాన్ననుకున్నావా?" "నేను నీ అంతవిశ్వాస ఘాతకురాల్ననుకున్నావా?" ఏమిటో, ఏదో ఘాటుగా అనాలని. అతన్ని గాయపర్చాలని వుంది ... అడగలేక పోతున్నది. కసిగా వుంది... అతను చాలా లవబుల్‌గా బిహేవ్ చేస్తూ తనని గాయపర్చాడు.

"మీరూమ్‌కే వెళ్తున్నాను," నీరసంగా నవ్వాడు.

"నేనూ నీకోసమే బయల్దేరి వచ్చాను."

శత్రువుల్లా పొడి పొడి పలకరింపులు.. "నిన్నటిదాకా వొకరి నొకరు పంచప్రాణాలుగా, కట్టుకున్న బట్టకంటె అపురూపంగా చూసుకొంటున్న ప్రేయసీ ప్రియులం మేము!"... ఏకాంతం కావాలి... అక్కడ. చూపిస్తాను తడాఖా...

"పద"

"పగోడా దగ్గిరికి" అలవాటైన కాళ్ళు అలవాటైన చోటికి తీసుకు వెళ్తున్నాయి, .. హఠాత్తుగా ఆగింది. శ్యామల' "నేనటు వేపు రాను"

"అదేం!"

"అక్కడ ఆ బీచ్‌రోడ్డున అంతా ఛండాలం, సభ్యతలేకుండా "మొగాళ్ళు"

"ఒస్స్! మొగాళ్ళంటే ఇన్నాళ్ళు లేని భయం" మూకరితో జోడించినట్టున్న నవ్వు.

"భయమా,,.? హుఁ! అసహ్యం!"

ఆమెకి అసహ్యం; అతనికి భయం.

"పోనీ ఇటువెళ్దాం పద..."

"ఇటూ రాను."

"ఇటేమిటుంది? ఒహో; వుమెన్స్ హాస్టలా?? హహ్హహ్హ! వెన కటి కెవతో, తనకి ఆడాళ్ళంటే అనుమానం మొగవాళ్ళంటే మొహ మాటం అన్నాదిట!"

"మనకి జోక్సొక్కటే తక్కువొచ్చాయి!"

అయింది. మళ్ళీ నేరస్తుడి మొహం పెట్టేసేడు...అనుకున్న దేగా; హర్ట్ చేయాలని!

అతను హర్ట్ అవలేదు.., ఫాల్స్ ఒబీడియెన్స్... మాకరీ.

"మరెక్కడికి వెళ్దాం?"

"నాకొక వందరూపాయలు తెచ్చి ఇయ్యి." ప్రతిధ్వనిలా వచ్చింది డిమాండ్.

"....."

"ఛీ" మొహం పక్కకి తిప్పుకుంది.

"అదికాదు శ్యాం..." -రోడ్డుమీద బ్రతిమాలుకోడం కష్టం..

"నిన్నడక్కూడదనుకుంటూనే అడిగేను."

ఆ పరిస్థితి కడుపులో పెట్టుకుని, అంతవేదన గుండెలోదింపు కొని, అలాటి వెచ్చటి నీళ్ళు కళ్ళలో తిరుగుతూండగా అడది రోడ్డు మీద ఎలక్ట్రిక్ పోల్ని అనుకుని నిల్చుంటే శేఖరంలాంటి మొగ వాడు తట్టుకోలేడు. అసలు గొప్ప గొప్ప ఆరేటర్సు దగ్గర్నుంచి ప్లిప్పెంట్ గా వాగేసే గిరీశంలాంటి వాళ్ళవరకు ఒట్టి మూగవాళ్ళు అయిపోయే పరిస్థితి అది.

విడమర్చి చెప్పాలని వుంది.

"ఆడదాని శరీరాన్ని వాడుకొన్నందుకు మొగవాడుగా నువ్వు చెల్లించవలసిన మూల్యంగా నేను అడగడంలేదు. నాకు వేరే పనుండి అడుగుతున్నాను" అని ఆమెకి.

"నేన్నీపట్ల చేసిన అపచారానికి పరిహారంగా నువ్వు వంద రూపాయలు అడుగుతున్నావని నేను అనుకోడంలేదు. నీప్రోగ్రాం ఏమిటని భోగట్టా చేసే వుద్దేశంతో-" అని అతనికి-

"నేనేం అన్నాను? డబ్బుకావాలన్నాను. రోజూ అడుగుతున్నానా? ... ఇచ్చీడమే.., ఎందుకు- నిజంగా అవసరమా - ఇలాంటి వన్నీ విడమర్చి చెప్పడం; అసలు చెప్పవలసిరావడం ఇంకా దైన్యంకాదా" అనుకొని బిగిసిపోయిందామె.

"అలాటి మాటలన్నీ యిక్కడ రోడ్డుమీద ఇంతమందిలో ఎలా చెప్పడం" అని అతను సాహసించలేదు.

## 3

చిన్నప్పుడు కలకత్తాలో నాన్నగారితో గార్డెన్ వుడ్రఫ్ కంపెనీకి వెళుతూవుండేది. అక్కడ ఒక ఆంగ్లో ఇండియన్ లేడీటైపిస్టు; నెలలో ముప్ఫైరోజులూ ఒక్కరోజు కూడా తప్పకుండా రోజూ ఆఫీసుకొచ్చేస్తూ ఉండేది. చాలాచురుగ్గా, ఎంతో చలాకీగా, ఆరోగ్యంగా వుండేది. ఆమెకేమీ బాధలులేవా అనిపించేది. అమ్మ నొకసారి అడిగేసింది. "అమ్మా, ఇంగిలీషువాళ్ళు ముట్టవరా?"

ఏ సబ్జక్టయినా సరే. డౌటొస్తే ఇంగిలీషులోవున్న పుస్తకం రిఫర్ చెయ్యడమే అలవాటు. వాళ్ళేం చేస్తారో; ఇలాంటి అపద వస్తే.

అవును. రాకుండా ముందే జాగర్తపడతారు. ఇక్కడా పడుతున్నారు ... తనుకూడా .... పొరపాటున ఒక్కరోజు జాగర్తగా వుండడం మరిచిపోయింది. అది మరపుకాదు.. ఏదో ఎక్స్టసీ. టైమ్‌లేదు.. వుండదు, ఇన్స్పిరేషన్‌కి కామన్‌సెన్సు స్లీపింగ్‌డోస్.. మొత్తంమీద జరిగింది పొరపాటు. వాళ్ళు మిస్టేక్ అంటారు..

పిల్లల్ని ఎవరికేనా చూపిస్తూ వేళాకోళానికి అవర్ ఫస్ట్‌మిస్టేక్, సెకండ్‌మిస్టేక్ అంటారుట.

ఈ మిస్టేక్స్ రెక్టిఫై చేసుకోవాలంటే.. వాళ్ళ పద్ధతులేమిటో!?

కాకతాళీయంగా యిచ్చింది, రోజీ, "ఈ పుస్తకం చూడు. బాయ్ ఫ్రెండ్సున్న నీలాంటివాళ్ళు చదవ్వలసిందొక ఎస్సే వున్నాదిందులో.'

'ఎబార్షన్' ఎ గరల్స్ స్టోరీ, 'నలభైమూడోపేజీ అండర్ లైన్ చేస్తున్నాది. తను చూసీ చూడకముందే నిర్మలా శ్రీనివాసన్ అందుకుంది; పుస్తకాన్ని.

'ఏం; నువ్వూ అలాంటి ఫిక్సలో పడ్డావా?' హాస్యం చేసింది శ్యామల.

'నువ్వా అంటున్నావు; నువ్వు పడ్డావేమిటి కొంపతీసి!' అని తిరగ్గొట్టింది నిర్మల.

"అదికాదు."శ్యామలమొహం ఎర్రబడింది. "ఆపుస్తకంలో గరల్‌లాగ అనబోయాను"

"పుస్తకంలో గరల్‌లాగ అవడానికి నేనేం మీలాగ మిస్"ని కాను. ఇవన్నీ మిస్‌లు చేసే మిస్-టేక్స్!"

"అలా అని రూలేమీలేదు. మిస్‌స్ట్రెస్‌లుకూడా ఒక్కొక్కనెల మిస్ అయ్యేరంటే స్ట్రెస్ తప్పదు" అనిరోజీ హెల్ప్‌చేసింది.

"మాటవరసకి మొగుడు ఫారిన్‌లోవున్న శ్రీమతి ఒకావిడ ఉన్నదనుకో" శ్యామలకి బలంవచ్చి నిర్మలమీద పెర్సనల్‌గా కలియబడ్డాది.

ఆ పుస్తకంలో వ్యాసం-... ఒకమ్మాయియుంటుంది. పాపం..

ప్రేమించినబ్బాయే. అప్పటికప్పుడు పెళ్ళి చేసుకోవాలంటే ఏవో అడ్డున్నాయి.

"తనలాంటి కేసే!"

ఆమెకి ఎవరో టెలిఫోన్లో చెప్తారు. నీకు ఇలాంటిలాంటి ఆపద వచ్చిందటగా. మేం వున్నాం నీకేం భయంలేదు! రేపు సాయంత్రం ఐదింటికి, ఫలానా హోటలు గుమ్మందగ్గిర గులాబీరంగు డ్రెస్‌తో నిలబడు. మాకార్లో నిన్ను మాహాస్పిటల్‌కి తీసుకొస్తారు. అంతా సుఖవుగా, నొప్పిలేకుండా త్వరగా జరిగిపోతుంది. మళ్ళీ ఎనిమిది లోపునే నిన్ను ఆ హోటల్ దగ్గిర మాకార్లోనే దిగబెట్టేస్తారు. 500 డాలర్లు తెచ్చుకో.. మిగిలిన ట్రీట్‌మెంట్ మీ ఇంటిదగ్గిర.

ఆమె వొప్పుకుంటుంది. తప్పదు కద!

500 డాలర్లు .... చాలా ఎక్కువేమో రూపాయల్లోకిమారిస్తే 3,750 అవుతుంది. వాళ్ళ దేశంలో డాలర్లు రూపాయల్లాంటివేమో. పోనీ అలా అయినా 500 రూపాయలంటే ఎక్కువ సొమ్మేకదా! ఎంత పెద్ద తప్పైనా అంతకంటె పెద్ద జరిమానా కాదా. అది?

అంతా చాలా బాగా జరిగిందట. పైగా ఆ 500 డాలర్లూ ఆమె ప్రియుడే సేకరించి ఇచ్చేట్ట.

తనకి? — అతనివ్వలేదు.... అడిగిందంతే ....

అడగాలి కాబోలు. అలా ఆధారపడాలికాబోలు, తప్పుచెయ్యడానికీ, తప్పులోంచి మర్యాదగాగాని అమర్యాదగాగాని తప్పుకోడానికీ, ప్రాకృశ్చిమాల తేడాలేకుండా ఆడది మొగాడిమీదనే ఆధారపడాలి కాబోలు .... మామిడిచెట్టును అల్లుకొన్నదీ మాధవీలతొకటి. బాష్! షియర్ నాన్సెన్స్!

"మా వీధిలో వొక ముసలావిడ వున్నాది. ఆఫీడికి ఇదొక

రెగ్యులర్ ప్రాక్టీసూ. నెలకి నాలుగు కేసులు కనీసం తగుల్తాయి— నేటివ్ ఆపరేషన్ లాంటిదేదో చేస్తుందనుకుంటాను. నోట్లో కేవో మందులుకూడా ఇస్తుంది" అంది నిర్మలా శ్రీనివాసన్.

"పోనిద్దూ, డర్టీ ఫెలోస్!" అని మొహం మటమట లాడించింది శ్యామల. "నాలుగు కేసుల మీదా నాలుగు వందలు సంపాదిస్తుంది కాబోలు .... నాలుగువేలు సంపాదించనీగాక ! ఛి ఛీ వెధవ బతుకు?" ఆడవాళ్ళ మధ్య కొచ్చేసరికి శ్యామల కన్జర్వేటివ్ అయిపోతుంది. లేకపోతే బతకడం కష్టమని ఆమె థియరీ.

"అలా అనకు. ఎవరి ఆపదలెలాంటివో!" అని సన్నాయి నొక్కు నొక్కింది రోజీ.

"వందలూ పుచ్చుకోదు. వేలూ పుచ్చుకోదు. కేసుకుయాభై రూపాయలు తీసుకుంటుంది. గ్యారంటీ ట్రీట్మెంటనీ, కాన్ఫిడెన్షల్‌గా వుంచుతుందనీ ఆవిడ దగ్గిరకొస్తారు." హుషారుగా ఇన్ఫర్మేషనిస్తోంది నిర్మల .... తన సంగతేమీ పసిగట్టి హెల్ప్ చేయడం లేదుకద?

"మీ వీధిలో నాకు తెలియని వాళ్ళెవరున్నారోయ్!!సిన్సియర్‌గా; కాజువల్‌గా.

"అదేనోయ్;ఆ ఎర్రడాబా పక్కన పాత పెంకుటింటి లోపలి గదిలో – నల్లటావిడా, బక్కపల్చగా వుంటుంది చూళ్ళేదూ! అన్నట్టొకసారి తేలుమంత్రం వేస్తుందని చూపెట్టేనే – అదు గావిడ !"

"ఓహో – ఎందుకిలాటి వెధ వనులు చేస్తుంది."

"బావుందోయ్, నువ్వన్నమాట ! ....నీకు అది వెధవపన్లాగ

కనిపించొచ్చు. కొందరి కదే అవసరం రావచ్చు. వాళ్ళ దృష్టిలో ఆ సమయంలో ఆవిడ దేవత."

"నా దృష్టిలో మాత్రం రాక్షసి! దాని కళ్ళుకూడా చెంగ ల్రావుపేట నూతుల్లాగ లోతుగా వుంటాయి. నల్లగా సన్నంగా చింపిజుట్టూ అదీ. షేక్స్పియర్ నాటకంలో విచెస్ అలాగేవుంటారు కాబోలు. అయితే మరి నాకు తెలియక అడుగుతాను! ఆవిడికి మొగుడ్లేడన్నావుకదా! మన సరస్వతిగారు పెట్టుకున్నంత బొట్టెం దుకు పెడుతుంది."

"అదా! .... ఆవిడ ఏదో శక్తిపూజ చేస్తుందట. ఆ పూనకం వున్నంతసేపూ బొట్టుపెట్టుకోవాలిట."

"దీనిశక్తి చల్లగావుండా!.... ఊఁహూఁ. అయితే పిల్లా పీచూ లేరు గాబోలు. అందుకే ఇలాంటిపనులు చేస్తుంది....పిల్లల్ని గన్న తల్లయితే ఇంతలేసి ఘోరాలు చేస్తుందా!"

"ఎందుకు లేరు! ఒక కొడుకున్నాడు. వాడికి ఈవిడ చేసే పనులు నచ్చకపోతే ఈ వూళ్ళోనే వేరే ఎక్కడోకాపరం పెట్టేట్ట"

"ఔను మరి .... ఇలాంటి పనులు చేస్తే స్వంత కొడుకైనా భరించడు."

డబ్బు తెచ్చీకూడా, గేటుదగ్గిర సారీ ఫేస్ కట్ చేసి నిల బడ్డాడు శేఖరం,

"అదుగోనోయ్, నీ బాయ్ ఫ్రెండు"

"బాయ్ కాదు, ఫ్రెండూ కాదు"

"బాయ్ కాకపోతే గర్లంటావా?"

"గర్ల్స్ ఆర్ ఫార్ బెటర్."

# 4

"అచ్చుతమ్మ ఎవరు ?"

"నేనే"

"అంజమ్మ పంపింది"

"కూర్చో"

"డబ్బు నిన్ననే పంపేను"

"ఇచ్చింది"

'ఆలస్యముందా ?'

'లేదు.'

"లోపలి కెళ్ళిపోయింది."

చీకటి కొట్లు. పాతకాలపు ఇళ్ళు, అనువత్రి వాననే కొత్త ఇంపుగా వుంటుందనిపించే దుర్గంధం. ఏం చేస్తుందో, 'నేటివ్ ఆపరేషన్ అంటే .... మోటకత్తిపెట్టి పరపరమని కోస్తారా ఏమిటీ చెప్మా !'

'ఈ డబ్బీలో ఎర్రమందు లేదేమే !' లోపల్నించిపెద్దకేక.

జవాబులేదు. డబ్బీ నేలకేసి కొట్టిన చప్పుడు. పది పదిహేను తిట్లు. "వెళ్ళు, వేగిరం పట్రా. మనిషి కూర్చున్నాడని చెప్పు, ఇక్కడున్నట్లు రావాలి."

పక్కని సందులోంచి ఎవరో ఆడమనిషి నడచినట్టు మట్టెల చప్పుడు, తలుపు తియ్యడం ; మళ్ళీ వెయ్యడం.

గుప్పుమని ఏదో నల్లమందువాసన్లా వచ్చిగదంతా కమ్మింది. అచ్చుతమ్మ నల్లమందేసుకుంటుంది కాబోలు.

'ఆ అను'

హడిలిపోయింది శ్యామల. తన పక్కనే మనిషి. ఎప్పొచ్చింది; ఎలా వచ్చింది. ఆశ్చర్యంలో నోరు తెరుచుకుంది.

నోట్లో ఏదో మాత్ర వేసింది. నల్లమందా! అడిగి వేయించుకోవలసింది. సమయానికి తెలివి తెల్లారింది ....

గోడకున్న అలమారు దగ్గరకి వెళ్ళింది అచ్చుతమ్మ. 'టేబిల్ మీద పడుకో పిల్లా'

పిల్లా!. ఏం పిలుపు .... చెప్పింది చెయ్యడానికి బుద్ధిపుట్టనంత వెగటుగా వుంది.

అచ్చుతమ్మ అలమార్లోంచి సామాను తీసింది, కత్తెర, ప్రాంగ్స్, దబ్బలం, నెత్తురు తుడవడానికి కాబోలు గుడ్డలు, గాజు గుడ్డ రీల్. ఆయింట్ మెంట్ ట్యూబ్.

"నేటివ్ ఆపరేషన్ !"

బార్బరస్ ప్రిమిటివ్–!

ఇంకెవరికైనా చేస్తూవుంటేకూడా చూడ్డం కష్టం. పోనీ అలా చూసినా బావుణ్ణు. మళ్ళీ వస్తానని చెప్పేస్తే .... అబ్బ ! ఈ పద్ధతి బాగులేదు.

మంచి పద్ధతులున్నాయిట .... చాలా జ్ఞానంతో వ్యవహరిస్తారు వాళ్ళు. జ్ఞానం అంటే శక్తిట పూర్వం. ఇప్పుడు జ్ఞానం అంటే మనీ .... బాగా డబ్బు పుచ్చుకుంటారు; రహస్యం తెలిసినట్టు మొహం పెడతారు. ఏప్రిన్స్, యూనిఫామ్స్ వేసుకొనే డాక్టర్స్ రహస్యాన్ని రహస్యంగా వుంచుతారని నమ్మకం కలగదు. వారు మన సర్కిల్స్‌కి దగ్గిరిగా రాగలరు. మనకు తెలిసిన వ్యక్తు లెవరి

తోనో ఎక్కడో ఒకసారి నోరు జారితే .... బస్! న్యూసెన్స్ మళ్ళీ ఆరంభం.

ఎక్కడో చదివింది - ఎబార్షన్స్ లీగలైజ్ చేయాలని ప్రభుత్వం సంకల్పించ వచ్చుట. అయినాపరే అది రహస్యంగానే వుంచాలికదా .... లీగలైజ్ చెయ్యవలసిన సోషల్ సీక్రెట్.

అది పెళ్ళాడిన వాళ్ళకోసం -

వాళ్ళ సంతానాలు పెరక్కుండాను, దేశానికి ఆహార సమస్య పెరక్కుండాను. మనకోసం కాదు .... పెళ్ళికానివాళ్ళ సీక్రెట్స్ లీగలైజ్ చెయ్యబడవు ... మరి, అందుకే 500 డాలర్లు!

ఒళ్ళు తిరుగుతున్నాది. నిద్రవస్తున్నట్లున్నది, స్పృహతప్పి పోవడానికి మందిచ్చిందా? మందేమీ అక్కర్లేదు. ఈ గదిలో ఐదు నిమిషాలు కూర్చుంటే చాలు! స్పృహ దానంతట అదే తప్పి పోతుంది.

అచ్చుతమ్మ బల్ల మరోమాటు శుభ్రంచేసింది. తలగడామీద దుమ్ము దులిపింది, ఒదల్లేదు. దుప్పటి అట్నుంచిటు తిప్పి తలగడా మీదుగా పరిచింది... అక్కడ పడుకోమని ఇందాకే అన్నది. ఇప్పుడు అసలూరుకోదు.

"నా కక్కర్లేదు! వెళతాను"

లేచింది.

ధడ్ !....

అచ్చుతమ్మ గభాల్నవచ్చి పట్టుకోకపోతే పడిపోయేది. "మతుందా లేదా!" కసిరింది. తీసుకెళ్ళి బల్లమీద పడుకోబెట్టింది.

"నాకు తెలివి తప్పిపోతుందా?"

"ఊఁ."

"ఆపరేషన్ చేస్తారా?"

"అవును"

"ఆ కత్తెర. దబ్బలం. అవేనా?"

నవ్వింది "భయంలేదు. నొప్పెట్టదు"

"నా కొద్దు"

.... .... —— ....

"ఒద్దంటే మాట్లాడవేం?"

"వెళ్ళి అబ్బాయిని మళ్ళీ బతిమాలుకుంటావా పెళ్ళిచేసుకోమని!!" చిరునవ్వులో వేళాకోళమేకాక ఏదో అపేక్షకూడా వున్నట్టుంది.

"అవన్నీ నీకెందుకు"

"అంజమ్మ అంతా చెప్పింది."

"చెబితే చెప్పిందిలే ...." తరవాత ఏమని దబాయించాలి? డాక్టర్ నోస్ యువర్ మిస్టేక్స్!

"మొగవాళ్ళు బతిమాలుకుంటే. వింటారా?

.... వింటే అదెంతకాలం?"

"నన్ను తీసికెళ్ళి రిక్షాలో కూచోబెట్టు. నేవెళ్ళిపోతాను. ఇక్కడంతావాసన భరించలేకుండా వున్నాను!" బలం ఎరువు తెచ్చుకుని బల్లదిగి వచ్చింది.

లోపలిగదిలో బూట్లచప్పుడు.

"అమ్మా!" మొగగొంతు పిలుపు.

"వచ్చే-" అచ్చుతమ్మ అటుతిరిగి కదిలింది. ఆ పిలుపు అచ్చుతమ్మకి కాదేమో. తననే ఎవరో అమ్మా అని పిలుస్తునట్టుంది. తియ్యగావుంది.

ఆ పిలుపు! మధురంగా వుంది ఆ పిలుపులోని భావం. మళ్ళీ మళ్ళీ వినాలనివుంది ఆ కంఠస్వరం. అంత తియ్యటి పిలుపు వుంటుందా? నేను అమ్మని పిలుస్తే అమ్మ అలాగ రెస్పాండ్ అవుతుందా?

కాబోలు,?

అచ్చుతమ్మ తలుపుదాకా వెళ్ళి వెనక్కొచ్చింది. "నామాట విని బల్లమీద పడుకో."

"ఇక్కడ బాగానే వున్నాది"

"ఈ బెంచీ సన్నం. పడిపోతే కిందపడిపోతావు"

"ఫరవాలేదు; వెళ్ళు"

తలుపు మూసింది. గొళ్ళెంవేసిన చప్పుడు. తలుపవతల గుస గుసలు, తల్లీ కొడుకూ సంభాషణ....తియ్యగా పిల్చేకొడుకూ, అభి మానంగా మాట్లాడే అమ్మ-అంత మెల్లిగా మాట్లాడతారేం?

కడుపులో బిడ్డ....అతినెమ్మదిగా మాట్లాడుతుంది....కదలికలే సంభాషణలు.... ఎబార్షన్ కాకపోతే బిడ్డపుడ్తుంది .... బిడ్డమాట ఇప్పుడే వినిపించదు....వినిపించని చప్పుళ్ళకోసం వీనుల అదుర్దా. ఆ అదుర్దాలో ఆనందం. ఆ ఆనందంతోనే కాబోలు అమ్మకాబోయే ఆడది పచ్చగా పుష్టిగా నున్నగా అయిపోతుంది .... అమ్మా అని పిలవ వలసిన బిడ్డ కడుపులోవుంటేనేకావలసినంత ఆనందం .... అమ్మా? అమ్మా? ఆదరం అపేక్షించినవారు అమ్మా అని పిలుస్తారు.... అమ్మగారు.... అమ్మ!.

తలుపుదాకావెళ్ళి వినాలనుంది "పడిపోతావు" అన్నది అచ్చుతమ్మ. అతనికి అమ్మ అచ్చుతమ్మ. అతనిపేరు అచ్యుతరావా?

గొంతుకలు పెద్దవవుతున్నాయి.

తలుపుదగ్గిర మనుషుల సడి, తలుపు సందులోంచి ఎవరిదో కన్ను - ఈ గదిలోని ఎలక్ట్రిక్ లైటువెల్తురు పడి ధళుక్కుమని మెరిసింది.

చూసేడు.

వాడెవడో నన్ను చూసేడు.

చూసేడు. గుర్తుపట్టేస్తాడు. రోడ్డుమీద వెళ్తూంటే-ఇదే యిదే-మాఇంటికొచ్చి మా అమ్మచేత .... దింపించుకున్నాది అని చెప్పేస్తాడు.

ఇక్కడ సీక్రెసీ ఉందండి నిర్మల.

లేదు లేదు. ఇక్కడ సీక్రెసీ లేదు, డీసెన్సీలేదు. కర్టెసీలేదు. ఇదొక కమేళా. నేటివ్ ఆపరేషన్లు....పరపర కోసి పారేస్తారు.

వాడెందుకొచ్చినట్టు? ఎందుకు చూసినట్టు?..అవును చూస్తాడు .... తల్లి భ్రూణహత్యలుచేసి డబ్బు సంపాదిస్తుంది. కొడుకు ఆ మనుషుల లిష్టురాసుకుని వాళ్ళ ఎడ్రసులు సంపాదించి బైటపెడతానని బెదిరించి వాళ్ళదగ్గిర డబ్బులాగుతాడు. బాగానేవుంటుంది; ప్రాక్టీస్—

మెదడు ఖరేల్మంది.

వెధవపని చేసింది తను. కప్పిపుచ్చుకోడానికి ప్రయత్నించడం అంతకన్నా వెధవపని. ఇది అయిపోతే దీనివల్ల ఆరోగ్యంగట్రా చెడిపోడమో లేక ఈ గాయాలు మానకపోడమో బ్లాక్ మెయిలింగో సంభవిస్తే మళ్ళా దానికోసం మరోతప్పు చెయ్యాలో

ఏమిటో! ఒక తప్పుని కప్పుకోడానికి వది తప్పులు....శిక్ష అనుభవించేసినా బాగుండేదేమో.

కష్టం. శిక్ష అనుభవించడం అంత తేలిక్కాదు.

చెయ్యొచ్చు. బాస్ మంచివాడు. విశాఖపట్నం బోరు కొడుతోంది సార్ అంటేచాలు. ఎక్కడికెక్కావాలంటే అక్కడికి పంపిస్తారు. ఏ అనంతపురమో దూరంగా వెళ్ళిపోయి అబద్ధాలుచెప్పి కాలక్షేపం చెయ్యొచ్చు.

తలుపవతల గొడవ.

"అరవకురా!"

"అరుస్తానా మరీ అరుస్తానా! .... నువ్వీ వెధవపన్లు మానమంటే మానవు. నేనేదో మర్యాదాగా యింత సంపాదిస్తున్నా నీ బుద్ధేనీది! చివరికి నీ విద్యంతా సరిగ్గా ఎవరిమీదా ప్రయోగించావో చూడు.. గొంతు తగ్గింది. మెల్లిగా మందలిస్తున్నాడు.

అతను చెప్పేది బావున్నట్టుంది...జ్ఞాపకం వచ్చిండి. నిర్మల ముందే చెప్పిందికదా. అతను బ్లాక్ మెయిలింగు చేసేమనిషికాదు.

తలుపుదగ్గిరకెళ్ళాలి.. అతని గొంతుక బావుంది. అతనాడే మాటలు బావున్నాయి. ఈ డర్టీ ఆపరేషన్లు వద్దంటున్నాడు..నన్ను అమ్మని కప్పుంటున్నాడు...గుడ్ గై...

"ఎర్రమందు తెచ్చేనమ్మా" దూరంనించి ఆడగొంతుక.

"వస్తున్నా"

"వస్తున్నాయి."నల్లమందు: ఎర్రమందు.దబ్బలం, కత్తెర — ప్రాంగ్స్ .... గుడ్డపేలికలు — ఇంగువముద్దలు. కంపు .... అమ్మా"ఓ అమ్మా! నన్ను చంపేస్తున్నావా;! ... అమ్మా నన్ను

పుట్టనియ్యవా?....అమ్మా నేనీన్నికు ఏ ఁ వఁపకారం చేసేను? అమ్మా నన్ను పుట్టనీ- నీకు తియ్యని పిలుపులందిస్తాను.... అమ్మా నువ్వీ వెధవపన్లు మానీవా? మర్యాదగా సంపాదిస్తున్నాను..తప్పు పన్లు చెయ్యకు. ఒక తప్పుని కమ్ముకోడానికి పది తప్పులు చెయ్యకు. సంవత్సరం ఆగితే పెళ్ళి చేసుకుంటాడు. ఆఫీసులో నచ్చజెప్పు. అనంతపురం వెళిపో....అమ్మా నాన్నా కలకటాలో వున్నారు .... సంగతి తెలీదు .... నీలాంటివాళ్ళు చదవ్వలసిన పుస్తకం ... 500 డాలర్లివ్వకు .... డీసెన్సీ, కర్టెసీ, సిక్రెసీ లేవు. వాటే మిస్టేక్! శేఖరం. ఎక్కడున్నావు? సగం మిస్టేక్ అయినా నీదని వొప్పుగో.

ధడ్;....

కళ్ళుతెరిచింది శ్యామల

తను ఇంతసేవూ తెలివితప్పి పడిపోయేవున్నాది కాని, ఆ మురికివాసన గదిలో కటిక నేలమీద కాదు. తన ఎదురుగా నిలబడ్డది అచ్చుతమ్మే కాని ఆమె చేతుల్లో ప్రాంగ్స్, దబ్బలం లేవు, పక్కన ఆమె కొడుకు శేఖరమే నిలబడ్డాడు గాని అతను పెళ్ళికోసం సంవత్సరం ఆగేటట్టుగా లేడు. కడుపులో బిడ్డ వున్నాదిగాని ఆక్రందన లేమీ చెయ్యడంలేదు.

శ్యామల మనస్సులో వొక్క క్షణం. తాను ఇటువంటి పన్లు చేసే అచ్చుతమ్మకు కోడలు కావలసిందేనా అని.ఇది డర్టీ న్యూసెన్సే మోనని అనుమానం పొడసూపింది గాని శేఖరం మొహంలోని నవ్వు కాంతికి అదట్టే సేపు నిలబళ్ళేదు.

ఇప్పుడు తను చేసింది మిస్టేకే అయినా తప్పు అనిపించు కోదు. ఔను. ఫస్ట్ మిస్టేక్....